క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

మహదేవపూర్ : మండలంలోని కిష్టరావుపేటకు చెందిన సింగినేని సారక్క కేన్సర్‌తో బాధ పడుతూ కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సాయం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంప్రదించారు. దీంతో మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సన్మానం



మల్హర్ : మండలంలోని కొయ్యూరు సర్పంచ్ సిద్ది లింగమూర్తి, ఉప సర్పంచ్ కొడురి మమతను బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య మంగళవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ ఏర్పడిన కొయ్యూరు తొలి సర్పంచ్‌గా లింగమూర్తి, ఉప సర్పంచ్ మమత, పాలకవర్గ సభ్యులు గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. బీసీ సంఘం నాయకులు యాదండ్ల రామన్న, చిన్న మల్లయ్య, సమ్మయ్య, రాజయ్య, రవి, తిరుపతి, పోతురాజు, శంకర్, మహిళ నాయకురాలు రజిత పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పీఆర్ఏఈ మాడిశెట్టి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు. మండలంలోని యామన్‌పల్లిలో డ్రెయినేజీ నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ప్రారంభించారు.

పీఆర్‌టీయూలో చేరిక

టేకుమట్ల : పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాములు ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయ సంఘాల నుంచి ఉపాధ్యాయులు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జీఓ 317 సవరణతో పాటు, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, బదిలీలు, స్పౌజ్ ఉద్యోగులకు అంతర్‌రాష్ట్ర బదిలీలు, డీఏల వంటి సమస్యల పరిష్కానికి కృషి చేస్తామన్నారు. పీఆర్‌టీయూ తెలంగాణ సంఘంలో చేరిన వారిలో దయాకర్, వేణు, సతీష్, మధుసూదన్‌రెడ్డి, చాగంటి ఆనంద్, రాజ్యలక్ష్మి, సంపత్, రఫీ ఉన్నారు.

పరామర్శ

చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పోశాల ఓదేలు ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు.

సెల్‌టవర్ ఎక్కి హంగామా

మహదేవపూర్ : మండలకేంద్రానికి చెందిన నవీన్ కులసంఘంలో డబ్బుల విషయంపై గొడవ జరిగింది. దీంతో మంగళవారం సాయంత్రం స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి హంగామా సృష్టించాడు. స్పందించిన ఎస్సై ప్రసాద్ టవర్ వద్దకు వెళ్లి కానిస్టేబుళ్ల ద్వారా యువకుడికి నచ్చజెప్పి కిందికి తీసుకువచ్చాడు. కుల సంఘంపై నవీన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తికి గాయాలు

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని మోరంచపల్లి గ్రామంలోని జాతీయరహదారిపై ఉన్న బ్రిడ్జిపై మంగళవారం సాయంత్రం చోట చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన బోగం రమేష్ భూపాలపల్లి నుంచి చల్లగరిగకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోరంచపల్లి బ్రిడ్జిపై బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు

భూపాలపల్లి రూరల్ : ట్రాక్టర్‌ను బస్సు ఢీకొట్టిన సంఘటన మంగళవారం భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కానుగుల నగేష్ పొలం పనులు చేసేందుకు ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపాడు. ఈ క్రమంలో భూపాలపల్లి నుంచి ఆజాంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టడంతో ట్రాక్టర్ పక్కనే ఉన్న పొలంలో పడింది. బస్సు ముందు అద్దాలు పగినట్లు తెలిపారు. కాగా, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఊపిరిపిల్చుకున్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం



చుంచుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మంగపేట: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని చుంచుపల్లి, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు యమున, స్వప్నిత అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ, మంగపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 13 వరకు 15 రోజుల పాటు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధికి ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా మెరుగైన వైద్యం విలువైన ముందులు ఇవ్వడం జరుగుతందన్నారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వ్యాధి పూర్తిగా తగ్గే వరకు మందులు ఇస్తామన్నారు. అనుమానాస్పదమైన స్పర్శలేని, రాగి రంగు మచ్చలు లాంటివి కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స ప్రారంభించడం వల్ల ఎలాంటి అంగవైకల్యం లేకుండా బయట పడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ వెంకటయ్య, వైద్యాధికారి వేణు, పీహెచ్ఎన్ శైలజ, సిబ్బంది వైజర్ గంగమ్మ, సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



వాజేడులో..

వాజేడు: మండల కేంద్రంలో మంగళవారం జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ.. గామాల్లో కుష్ఠు బారిన పడిన వారిని గుర్తించి వారికి మందులు అందించాలని అన్నారు. ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామ పంచాయతీల్లో ఆశ వర్కర్లతో సర్వే వ్యాధిగ్రస్తులను గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది గ్యానస, సూర్య ప్రకాశ్‌రావు, వెంకటరమణ, కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేంద్ర కుమారి, లలిత కుమారి, చాయదేవి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.



మంగపేట: మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైద్య సిబ్బంది

జాతరపై మంత్రి ప్రత్యేక దృష్టి



గోవిందరాజుల ఆలయాన్ని సందర్శిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మేడారం జాతరపై మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండలంలోని కొండాయిలో కొలువై ఉన్న గోవిందరాజులు, నాగులమ్మ, దొడ్లలోని సారలమ్మ ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రఘు మాట్లాడుతూ.. పూర్తి స్థాయిలో జాతర విజయవంతం కావడానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు తాగు, రోడ్డు సౌకర్యం, వైద్యం, రక్షణ వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కెర లాలయ్య, వావిలాల ఎల్లయ్య, నర్సంహారావు, దబ్బకట్ల సత్యనారాయణ, పాయం రాఘవయ్య, మహేష్, కమలక్క, బొచ్చు నాగయ్య, బొచ్చు ప్రకాశ్, ఆలం నాగార్జున పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న భిక్షపతిగౌడ్

ములుగు రూరల్: మండలంలోని సర్వాపూర్‌కు చెందిన పోలెం నర్సక్క ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ భిక్షపతిగౌడ్ మంగళవారం పరామర్శించి సర్వర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు తస్లీమా మహ్మద్ సహకారంతో రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గుండ్ల నర్సమ్మ కుటుంబానికి చేయూత నందించారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న బీసీ మల్రిగూడెం గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మల్రిగూడెం పంచాయతీ నుంచి ఏడుచర్లపల్లి గ్రామం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతూ మంగళవారం బీసీ మల్రిగూడెం గ్రామస్తులు దుర్గమ్మ గుడి సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ మల్రిగూడెం నుంచి ఏడుచర్లపల్లి వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతుల కోసం ఆరు నెలల కిందట అధికారులు రోడ్డును తవ్వించి కంకర పోసి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు మరమ్మతు చేయించాలని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన వారు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గోవిందరావుపేట: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 01 2020 వరకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రులు అర్హులని తెలిపారు. మండల కేంద్రంలోని అన్ని గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతి గ్రామంలోని పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఓటును నమోదు చేయించాలన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఏటూరునాగారం: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా తుడుందెబ్బ అధ్యక్షుడు ఎట్టి ప్రకాశ్ అధికారులను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తాగునీరు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో రోడ్డు మరమ్మతులు, డ్రెయినేజీ మరమ్మతుల వల్ల మిషన్ భగీరథ పైప్ లై న్లు చాలా చోట్ల రోడ్డు కట్ చేశారన్నారు. దీనివల్ల నీరు కూడా సక్రమంగా రావడం లేదన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఓడబలిజ నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్‌ను ఓడబలిజ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓడబలిజ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గార ఆనంద్, రాష్ట్ర కోశాధికారి గార పోశాలు మాట్లాడుతూ.. గోదావరి నది తీర ప్రాంతంలో ఉంటూ చేపల వత్తినే ప్రధాన వృత్తిగా భావించి చేపల వేటను సాగిస్తూ జీవనం సాగిస్తున్న ఓడబలిజలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సకాలంలో అందజేసేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భానుప్రకాశ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యాదగిరి

ములుగు రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సాంఘీక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్, జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా సంఘం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ప్రమోషన్‌లు, బదిలీలు చేపట్టాలని అన్నారు. 317 జీఓపై స్పష్టతనివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

గోవిందరావుపేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం అని ప్రధానోపాధ్యాయులు కల్తి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కర్లపల్లి పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేందుకు తల్లిదండ్రులతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. మంచి మార్కులు రావాలి అంటే ఉత్తమ మైన క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థుల కోసం ఎంతో వినూత్న కార్యక్రమాలు చేస్తుందని 100 రోజుల ప్రోగ్రాం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని రోజు వారి టెస్టుల ద్వారా మంచి మార్కులు రావడానికి వీలవుతుందని తెలిపారు. కర్లపల్లి పాఠశాలలో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు అద్భుతమైన బోధన అందిస్తున్నారు అని అన్నారు. రోజు అదనపు క్లాసుల ద్వారా బోధిస్తున్నట్లు తెలిపారు.

మహానుభావులను మరువొద్దు

ములుగుపల్లి : మహానుభావుల చరిత్రను నేటి ప్రజానీకం మరచిపోకుండా వారు చూపిన మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బస్టాండ్ కూడలిలో ఆర్యక్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం, తాపీమేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాలను వారు హాజరై ఆవిష్కరించారు.

చిట్యాల : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ



శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రేగొండ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ ఎడెల్లి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారులు ఎడెల్లి వెంకటరెడ్డి, ఎడెల్లి సునీల్ రెడ్డి మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు పాఠశాలలో శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏడునూతుల నిశిధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు దేవేందర్, రాధాకృష్ణ, సంధ్యారాణి, అనసూయ, నాయకులు తూర్పాటి మల్లేష్, మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, పెండ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): గొత్తికోయ గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వెంకటాపురం(ఎం) ఎస్సై చల్ల రాజు పేర్కొన్నారు. మండలంలోని రామకృష్ణాపూర్ శివారులోని ఉట్లతోగు, గొత్తికోయగూడెంను మంగళవారం పోలీసులు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రతి గుడిసెను క్షుణ్ణంగా తనిఖీ చేయడం తోపాటు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వద్దని సూచించారు. గొత్తికోయలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకూడదని, అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. చిన్నపిల్లలను కచ్చితంగా చదివించాలని, వారితో ఎలాంటి పనులు చేయించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసిబ్బంది, గొత్తికోయలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



అటవీ ప్రాంతంలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ఎస్ఎస్ తాడ్వాయి: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కార్మికులు మేడారంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మహాజాతర సందర్భంగా మంగళవారం భక్తులు పడేసిన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పారిశుద్ధ్య కార్మికులు పనులు చేపట్టారు. మేడారం పరిసరాల్లోని బస్టాండ్, అటవీ ప్రాంతం, చిలుకలగుట్ట, జంపన్నవాగు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచుతున్నారు. అంతేకాకుండా కన్నెపల్లి సారలమ్మ గుడి సమీపంలోని శాశ్వత మరుగుదొడ్లను శుభ్రం చేశారు. పారిశుద్ధ్య పనులను డీపీఓ వెంకయ్య పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా వందల సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చిన భక్తులు ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పడేయకుండా చూడాలని కార్మికులకు సూచించారు.



మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్న కార్మికురాలు

భోజన తయారీలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలత

ములుగు రూరల్: ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అందించే భోజన తయారీలో సంబంధిత ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శ్రీలత సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలోని ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ గిరిజనశాఖ సెక్రటరీ శరత్, ఐటీడీఏ పీఓ అంకిత్, డీడీ పోచం, ఐటీడీఓ దేశిరాం ఆదేశాల మేరకు పాఠశాలలో రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఏసీఎంఓ వాగ్యా, పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, డాక్టర్ మల్లికార్జున్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, బాలల సంరక్షణ అధికారి ఓంకార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారత్న అవార్డుకు రవీందర్‌రెడ్డి ఎంపిక



ఆహ్వానపత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

భూపాలపల్లి అర్బన్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యారత్న జాతీయ అవార్డుకు మండలంలోని గొల్లబుద్దారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందల రవీందర్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రాన్ని రవీందర్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. రవీందర్‌రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాటి నుంచి ఉపాధ్యాయ వృత్తితో పాటు పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతున్నారని చెప్పారు. అక్షర దీపిక కార్యక్రమంలో వయోజనులకు విద్య అందించడం, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి పలు పాఠశాలలను ఆదర్శవంతంగా మార్చినట్లు చెప్పారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రవీందర్‌రెడ్డి సేవలను అందించినట్లు తెలిపారు. సేవలను గుర్తించి జాతీయ విద్యారత్న అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో విద్యారత్న నేషనల్ అవార్డును అందజేస్తున్నట్లు చెప్పారు.

జంతువులపై ప్రేమ కలిగిఉండాలి

భూపాలపల్లి రూరల్ : ప్రతి ఒక్కరికీ జంతువులపై ప్రేమ కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీదేవి అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జంతు సంక్షేమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర జంతువులు మానవ జీవితంలో ఒక భాగమన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెంపుడు శునకాలకు యాంటిరేబిస్ టీకా వేయించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లోని పశు వైద్యశాలల్లో ఉచితంగా కుక్కలకు యాంటిరేబిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి, వైస్ చైర్ పర్సన్ కళ్లెపు శోభతో పాటు తదితరులు పాల్గొన్నారు.

యాంటిరేబీస్ టీకాలు

టేకుమట్ల : మండల కేంద్రంతో పాటు, రామకిష్టాపూర్(టి) గ్రామంలో మంగళవారం పశువైద్యాధికారి వివేక్ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు యాంటిరేబీస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతు సంరక్షణ వారోత్సవాల సందర్భంగా పెంపుడు జంతువుల (శునకాలు)లకు ఉచిత టీకాలు వేసినట్లు తెలిపారు. ఆయన వెంట గోపాల మిత్ర మేకల కుమారస్వామి, తదితరులు ఉన్నారు.